పీలేరు: బారులు తీరిన మహిళా ఓటర్లు

కడపలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కడప కలెక్టర్ విజయ్‌రామరాజు

అధికారులకు సూచనలిస్తున్న అన్నమయ్య జిల్లా జెసి తమీమ్ అన్సారియా

పులివెందులలో ఓటు వేస్తున్న టిడిపి పట్టభద్రుల అభ్యర్థి రామ్‌గోపాల్‌రెడ్డి

మండలి పోరు ప్రశాంతం

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ చెదురుమదురు ఘటనల మినహా ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో కడప, అన్నమయ్య జిల్లా అధికార యంత్రాంగం సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పకడ్బందీ బందోస్తు మధ్య పోలింగ్ నిర్వహించింది. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల నియోజకవర్గ కేంద్రాల్లోని రెండేసి పోలింగ్ బూత్‌ల పరిధిలో అధికార వైసిపి బరితెగించి టిడిపి ఎమ్మెల్సీ బి.టెక్ రవి వాహనంపై రాళ్ల దాడులు, ప్రొద్దుటూరు ఉక్కు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అధికార వైసిపి నేత మధ్య ఘర్షణ చోటుచేసుకోవడం, అక్కడక్కడా వైసిపి పోలరైజేషన్‌లో భాగంగా నగదు పంపిణీ, దొంగఓట్లకు పాల్పడడం వంటి స్వల్ప ఘర్షణలు మినహా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముగియడం ఉపశమనం కలిగించిది.

- కడపలో పట్టభద్ర పోలింగ్ 72.01 శాతం
- ఉపాధ్యాయ పోలింగ్ 91.31 శాతం
- అన్నమయ్యలో పట్టభద్ర పోలింగ్ 68.31 శాతం
- ఉపాధ్యాయ ఓట్ల పోలింగ్ 93.36 శాతం
- కడప, వేంపల్లెలో దొంగ ఓట్ల జోరు
- టిడిపి, వైసిపి నేతల మధ్య వాగ్వాదం
- కడప, ప్రొద్దుటూరు, మైదుకూరుల్లో నగదు పంపిణీ?
- లింగాలలో ఎమ్మెల్సీ బి.టెక్ రవి కారుపై రాళ్లదాడి

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కడప, అన్నమయ్య జిల్లాల ఎస్‌పిలు అన్బురాజన్, హర్షవర్ధన్‌రాజు

కడప జడ్‌పి ప్రాంగణంలోని పోలింగ్ కేంద్రంలో ఎండలో బారులు తీరిన ఓటర్లు

పులివెందులలో ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి

కడప మహిళా కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకున్న బద్వేల్ ఎంఎల్ఏ

ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కొరముట్ల, డిసి గోవిందరెడ్డి

రాళ్లదాడిలో ధ్వంసమైన బిటెక్ రవి కారు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నిక బరిలో 39 మంది పట్టబద్ర, 12 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు నిలిచారు. కడప, అన్నమయ్య జిల్లా అధికార యంత్రాంగాలు 212 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కడప జిల్లాలోని 36 మండల కేంద్రాల్లో 131 పోలింగ్ కేంద్రాల్లో 93 పట్టభద్ర, 38 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల పరిధిలో 81 పోలింగ్ కేంద్రాల్లో 51 పట్టభద్ర, 30 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాల్లో పెద్దఎత్తున ఓటర్లు బారులు తీసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కడప జిల్లాలోని మరియాపురం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం ఆవరణలో ఎండ వేడిమి బారి నుంచి రక్షణకు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది.

మధ్యాహ్నం నుంచి ఊపందుకున్న పోలింగ్

జిల్లాలో సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు పోలింగ్ మందకొడిగా నడిచింది. మధ్యాహ్నం అనంతరం పోలింగ్ వేగం ఊపందుకుంది. జిల్లాలో పోలింగ్ ముగిసే సమయానికి పట్టభద్ర పోలింగ్ 72.01శాతం, ఉపాధ్యాయ పోలింగ్ 91.31 శాతం, అన్నమయ్య జిల్లాలో పట్టభద్ర పోలింగ్ 68.31 శాతం, ఉపాధ్యాయ పోలింగ్ 93.36 శాతం నమోదైంది. ఉభయ జిల్లాల్లోని పోలింగ్ కేంద్రా ల్లో వైసిపి నేతల ఓటింగ్ పోలరైజేషన్ వ్యూహాన్ని పకడ్బందీగా అమలు చేశారు. ఫలితంగానే మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 6.30 పోలింగ్‌వేగం ఊపందుకుంది. రాయచోటి, ప్రొద్దుటూరులోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6.30 గంటల వరకు పోలింగ్ కొనసాగడం గమనార్హం.

బరితెగించిన అధికార వైసిపి

కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల నియోజకవర్గాల్లో అధికార వైసిపి బరితెగింపునకు పాల్పడింది. ఫలితంగా జిల్లాలో పలుచోట్ల ఘర్షణ వాతావరణం ఏర్పడింది. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వారీగా వైసిపి నాయకత్వం తమ కేడర్‌ను వినియోగించుకుని ఓటింగ్ పోలరైజేషన్ వ్యూహాన్ని పకడ్బందీగా అమలు చేసింది. కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో అధికార వైసిపి పట్టభద్రులకు రూ.వెయ్యి, ఉపాధ్యాయులకు రూ.5 వేలు చొప్పున పోలింగ్ కేంద్రం వెలుపలి ప్రాంతాల్లో తిష్టవేసి పంపిణీ చేయడం విశేషం. మధ్యాహ్నం అనంతరం కడప, అన్నమయ్య జిల్లాలోని మున్సిపల్ ఉర్దూ పాఠశాల, వేంపల్లి, లింగాల, ప్రొద్దుటూరు, అన్నమయ్య జిల్లాలోని రాయచోటిడైట్, గాలివీడు ప్రాంతాల్లోని ఏజెంట్ల నియామకం పట్ల అభ్యంతరాలు, పలువురు వాలంటీర్ల సహాయంతో పెద్దఎత్తున దొంగఓట్ల జోరు కొన సాగింది. కడప, వేంపల్లి పోలింగ్ కేంద్రాల్లో దొంగఓట్ల పోలింగ్‌ను గుర్తించినప్పటికీ ఆశించిన ఫలితం కనిపించలేదని తెలిసింది.

బి.టెక్ రవి వాహనంపై రాళ్లదాడి

పులివెందుల నియోజకవర్గ పరిధిలోని లింగాల పోలింగ్ కేంద్రం సమీపంలో టిడిపి ఎమ్మెల్సీ బి.టెక్ రవి వాహనంపై రాళ్లదాడి చోటుచేసు కుంది. అధికార వైసిపి, టిడిపి కార్యకర్తలు బాహాబాహీ తలపడడం తీవ్ర ఉద్రిక్తతలకు దారిసింది. వేంపల్లి మండల పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం నుంచి జోరుగా దొంగఓట్ల పోలింగ్ చోటుచేసుకుంది. ప్రతిపక్ష, పిడిఎఫ్ అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఆశించిన ఫలితం కనిపించని వాతావరణం ఏర్పడింది. ప్రొద్దుటూరులో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ఇన్‌ఛార్జి ఉక్కు ప్రవీణ్ మధ్య బాహాబాహీ ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. కడప ఎస్‌పి తుషార్ డూడీ, ప్రొద్దుటూరు డిఎస్‌పి జోక్యంతో ఘర్షణ సద్దుమణిగింది.

కడపలో పోలరైజేషన్ జోరు!

జిల్లా కేంద్రమైన కడప మున్సిపల్ ఉర్దూ పాఠశాల అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎర్రముక్కపల్లి సర్కిల్ పరిధిలోని గాంధీనగర్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో దొంగఓట్ల చలామణిని అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం వంటి ఘటనలతో స్వల్ప వివాదాలు చోటుచేసుకోవడం గమనార్హం.

విద్యావంతులు పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిస్తారు

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ వెల్లడి

ప్రజాశక్తి కడప అర్బన్

విద్యావంతులు విజ్ఞతతో ఓటు వేసి పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించబోతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం సిపిఎం జిల్లా కార్యాలయం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటల్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులుగా పోటీ చేసిన వారి మద్దతు దారులు, బూతుల వద్ద 'పోలీసుల సాక్షిగా' ఓటర్లను ప్రభావితం చేస్తూ, ప్రలోభాలకు గురి చేస్తూ, డబ్బు పంపిణీ చేశారని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారులకు, జిల్లా పోలీస్ అధికారులకు తెలియజేసినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. కంటి తుడుపు మాటలతో కాలం వెళ్లబుచ్చారని విమర్శించారు. అప్రజాస్వామిక పద్ధతుల్లో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిందని తెలిపారు. ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై చట్టసభల్లో మాట్లాడే ప్రతిభావంతులైన విద్యావంతులను ఎన్నుకునే ఈ ఎన్నికల్లోనూ సాధారణ ఎన్నికల లాగా ప్రలోభాలు, దౌర్జన్యాలు, అసాంఘిక శక్తులతో అక్రమాలు అప్రజాస్వామిక పద్ధతులన్నీ ప్రయత్నించిందని పేర్కొన్నారు. ఇది 'ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ' చేసే విధానమని తెలిపారు. దీనిని విద్యావంతులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, కచ్చితంగా, విజ్ఞతతో, ఆలోచించి ఓటు వేసి, పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిస్తున్నారని చెప్పారు. 2024 జరగబోవు అసెంబ్లీ ఎన్నికలకు, జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు 'సెమీఫైనల్‌గా పరిగణించి వైసిపి ప్రభుత్వం రూ.150 కోట్ల పైగా ఖర్చు చేశారని తెలిపారు. వారికి, భంగపాటు తప్పదు హెచ్చరించారు. సిద్ధవటం మండలంలో పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు ఎన్నికల ఏజెంట్‌గా సురేష్ బాబు ఉదయం 6 గంటలకు వెళ్లి ఏజెంట్ ఫారం, ఫొటోలు, ఓటర్ ఐడెంటి కార్డు ఇచ్చి పోతుల నాగరాజు తరుపున ఏజెంట్‌గా కూర్చుంటున్నానని చెప్పినా, స్థానిక పోలింగ్ బూత్ ఆఫీసర్, ఎన్నికల నిబంధనలకు భిన్నంగా వ్యవహరించారన్నారు. ప్రతిపక్షాల ఏజెంట్లు లేకుండానే పోలింగ్ జరిపించారని పేర్కొన్నారు. వారిని వెంటనే రాష్ట్ర ఎన్నికల అధికారి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గాంధీ స్కూల్ వద్ద సాక్షాత్తు నగర ప్రథమ పౌరులు మేయర్ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించుతూ , మీటింగు నిర్వహించారని దీనికి ప్రత్యక్ష సాక్షులు పోలీసులేనని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిద్రపోతుందని ప్రశ్నించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, రామ మోహన్, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఆర్ఐఓ రమణరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్ఐఓ రమణరాజు పేర్కొన్నారు. సోమవారం ప్రజాశక్తితో మాట్లా డుతూ జిల్లా వ్యాప్తంగా 92 పరీక్ష కేంద్రా లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పరీక్షలు ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఉంటాయన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలని పేర్కొన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. మొదటి సంవత్సరం 18,377 మంది, ద్వితీయ సంవత్సరం 24,696 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సిసి కెమెరాల నిఘాలో పటిష్ట భద్రత కల్పించామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలన్నీ ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా జిల్లా ఆర్ఐఓ కార్యాలయంలో, ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక హై పవర్ కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. 4 ఫ్లయింగ్ స్క్వాడ్, 10 మంది సిట్టింగ్ స్క్వాడ్, 10 సెంట్ కస్టోడియన్లుగా నియమించామన్నారు. సమస్యలు ఉంటే ఆర్ఐఓ కార్యాలయంలోని కంట్రోల్ రూం నంబరు 08562-244171కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించి సెల్ ఫోన్స్, యూట్యూబుల ద్వారా వచ్చే ఎలాంటి పుకార్లను నమ్మవద్దని కోరారు.



మాట్లాడుతున్న ఆర్ఐఓ రమణరాజు

గిడుగు రుద్రరాజు అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి - కడప

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు సోమవారం అదానీ అక్రమ వ్యాపారాలపై నిరసిస్తూ రాజ్ భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు వినతిపత్రం ఇవ్వాలని బయలుదేరిన సమయంలో పోలీసులు వారిని విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్దనే, వెళ్లనీయకుండా అరెస్టు చేయడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నీలి శ్రీనివాసరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీ గ్రూపులలో పెట్టుబడులను ప్రోత్సహించడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని, హిండెన్ బర్గ రిపోర్ట్ ప్రకారం ఆదాని గ్రూపు కంపెనీలు డొల్ల కంపెనీలనీ, అలాంటప్పుడు ఆదానీ గ్రూప్ కంపెనీలలో కేంద్రం ఏ విధంగా పెట్టుబడును ప్రోత్సహిస్తుందో తెలపాలన్నారు. దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని గవర్నర్‌ను కోరడానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం సరైందని కాదన్నారు. పోలీసు బలం ఉపయోగించే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తు న్నారన్నారు. ఇప్పటికైనా కేంద్రం అదానీ గ్రూపులలో పెట్టుబడులు విరమించుకొని, అదాని ఆర్థిక లావాదేవీల పై విచారణ చేపట్టడానికి జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలన్నారు.లేదా కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలకు పిలుపునిస్తామన్నారు.

మాట్లాడుతున్న నీలిశ్రీనివాసరావు

వాగ్దేవి వరపుత్రిక మొల్లమాంబ

ప్రజాశక్తి కడప అర్బన్

మొల్లమాంబ వాగ్దేవి వరపుత్రిక అని తన రామాయణంలో శివకేశవ అభేదంతో శ్రీరామ దర్శనం చేసిన మహా సాధ్వి అని మహా కవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు శ్లాఘించారు. సోమవారం నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో ఉన్న మొల్ల విగ్రహానికి తొలుత పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొల్ల సాహితీ జయంతి మహోత్సవాలు ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని తెలిపారు. ఆమె జన్మస్థలికి మొల్ల గోపవరం మండలంగా పేరు పెట్టాలని కోరారు. కడపలో మొల్ల తెలుగు అకాడమీ ఏర్పాటు చేయాలని, మొల్ల రామాయణం వ్యాఖ్యానం తో యోగి వేమన యూనివర్సిటీ ముద్రించి అందుబాటులో కి తీసుకురావాలని పేర్కొన్నారు. మరో భద్రాద్రి గా పేరుగాంచిన ఒంటిమిట్ట శ్రీరామ క్షేత్రంలో మొల్ల విగ్రహం పెట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో మొల్ల సాహితీపీఠం ఉపాధ్యక్షుడు పెండ్లిమర్రి మల్లయ్య, మహిళా కార్యదర్శులు ముడిపల్లి పార్వతమ్మ, పి. పార్వతి పాల్గొన్నారు.

బి.సి. సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాసా కోదండ రామ్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు దేవర శ్రీకృష్ణ మొల్లమాండ విగ్రహానికి పూల మాల వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో రాయల్ కరిముల్లా పాల్గొన్నారు.

మొల్ల విగ్రహానికి నివాళు లర్పిస్తున్న గానునపెంట

మందుల సరఫరాకు టెండర్లు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప అర్బన్

పోలీసు సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నగరంలోని పోలీస్ వెల్ఫేర్ ఫార్మసీకి కావలసిన మందులను సరఫరా చేసేందుకు అవగాహనా ఒప్పందం చేసుకునేందుకు సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల 1 నుంచి 2024 మార్చి నెల 31 వరకు మందుల సరఫరాకు అవగాహన ఒప్పందం కోసం ఆసక్తి కలిగిన మెడికల్ ఏజెన్సీస్ నిర్వాహకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈనెల 14 ఉదయం 10 గంటల నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో తమ సీల్డ్ టెండర్లను దాఖలు చేయవచ్చని తెలిపారు.

22న వేలం పాట.. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు అవగాహన ఒప్పందం కోసం 22 న ఉదయం 10 గంటలకు ఉమేష్ చంద్ర కల్యాణ మండపంలో నిర్వహించనున్న ప్రత్యక్ష వేలంలో ఆసక్తి కల్గిన డెకరేటర్లు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

వైభవంగా శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఎర్రముక్కపల్లిలో కొలువుదీరిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి వార్షికోత్సవం, అగ్నిగుండ జ్యోతి మహోత్సవాలు అత్యంత వైభవంగా, శోభాయ మానంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి 14 అమ్మవారి జ్యోతులతో పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చన, అభిషేకాలు చేశారు. రాత్రి అమ్మవారి జ్యోతులను భక్తులు తలమీద ఉంచుకుని భక్తి గేయాలకు నృత్యం చేస్తూ ముందుకు సాగారు. పురవీధులలో అమ్మవారికి హారతులు ఇస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఒకపక్క డప్పుల విన్యాసం, మరోపక్క మిరమిట్లు గొలిపే బాణ సంచా పేలుళ్లతో, యువకులకేరింతలతో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టి పడింది. సోమ వారం ఉదయం వేలాది మంది భక్తుల మధ్య అమ్మవారి జ్యోతులు అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. అగ్నిగుండ జ్యోతి మహోత్సవాలకు తొగటవీరక్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్య క్రమంలో జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ, జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, రాయలసీమ అధ్యక్షులు బొమ్మల వెంకట రత్నం, శిబ్యాల విజయభాస్కర్, సంగినాదం ఆంజనేయులు, గంజికుంట గణేష్, బొమ్మి శెట్టి చంద్రశేఖర్, సి ఆర్ ఐ సునీల్ జయంత్, ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, కందికండి రమేష్, పల్లాబాలచౌడన్న, సుంకర రామచంద్రుడు, బొల్లు సోమశేఖర్, బండి కృష్ణయ్య, శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయకమిటీ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు వెలిగండ్ల సుబ్బరాయుడు, వెలిగండ్ల సుబ్బయ్య, ఇడెం మల్లిఖార్జున, ఇడెం సురేంద్ర, కాల్వ వాగేష్ టేకూరి పుష్పాంగధ, బోమ్మిశెట్టి శ్రీ రాములు యర్రముక్కపల్లె వాస్తవ్యులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. శ్రీ చౌడేశ్వరి దేవి దేవస్థానం అధ్యక్షులు కళ్యాసుధాకర్, ఉత్సవ కమిటీ సభ్యులు పల్లా నరసింహారావు, టేకూరి సుదర్శన్, మోతుకూరు సుబ్బరాయుడు, వెలిగండ్ల లక్షుమయ్య అమ్మవారి అగ్నిగుండ జ్యోతి మహోత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేందుకు విశేషంగా శ్రమించారు.

జ్యోతి మహోత్సవాల్లో పాల్గొన్న మోడెం వీరాంజనేయప్రసాద్, నృత్యాలు చేస్తున్న కళాకారులు

పాపను లాలిస్తున్న మహిళా కానిస్టేబుల్ సుజిత

సేవాభావం చాటిన మహిళా కానిస్టేబుల్ సుజిత

ప్రజాశక్తి - జమ్మలమడుగు

సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళా కానిస్టేబుల్ తన సేవాభావాన్ని చాటారు. జమ్మలమడుగు రూరల్ పరిధిలోని తల మంచిపట్నం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ సుజిత (డబ్ల్యూ.పి.సి 2152) పెద్దముడియం మండలంలోని జిల్లా పరిషత్ స్కూల్‌లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఓ మహిళ మూడు నెలల పసికందును తన వెంట ఎత్తుకొని ఓటు వేసేందుకు రాగా, చిన్నారి ఏడుస్తుండడంతో అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సుజిత ఆ చిన్నారిని ఎత్తుకుని లాలించారు. అక్కడే ఉన్న ఓటర్లు, సిబ్బంది ఆమెను అభినందించారు. విషయం తెలుసుకున్న ఎస్‌పి కె.కె.ఎన్ అన్బురాజన్ మహిళా కానిస్టేబుల్ సుజిత సేవలను ప్రశంసించారు.

ప్రతిపక్ష నాయకులపై దాడులు శోచనీయం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతిపక్ష నాయకులపై మాత్రమే దాడులు చేస్తూ రాజ్యాంగ వ్యవస్థలు దుర్వినియోగం అవుతున్నాయని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ఇడి, ఐడి, సిబిఐ తదితర రాజ్యాంగ వ్యవస్థలు దుర్వినియోగం అవుతున్నట్లు ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులపై మాత్రమే దాడులు జరుగుతున్నాయని తెలిపారు. బిజెపి నాయకుల మీద దాడులు జరగడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులు బిజెపిలో చేరితే దాడులు ఉండవని అన్నారు.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సాహించి 9 రాష్ట్రాల్లో బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేశారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ చెబితే బిజెపి నాయకులకు అంత ఉలికిపాటు ఎందుకని తులసిరెడ్డి ప్రశ్నించారు.

ఎన్నికల్లో బహిరంగంగానే అక్రమాలు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలలో అధికార పార్టీ ఓటర్లను ప్రలోభ పెట్టి బహిరంగంగా డబ్బులు పంచి అక్రమాలకు పాల్పడిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సగిలి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆయన పోరుమామిళ్లలో మాట్లాడుతూ ఎన్నిక లలో ఉన్నత చదువులు చదువుకున్న ఉపాధ్యాయులు, పట్టభద్రులకు కూడా డబ్బుని ఎరగా చూపి అధికార పార్టీ కొనుగోలు చేస్తుంటే అధికారులు చూస్తూ ఉండిపోయారని వాపోయారు. ఇలాంటి అక్రమాలు ఎన్నికల్లో జరుగుతూ ఉంటే ప్రజాస్వామ్యం ఏ విధంగా మనగలుగుతుందని ప్రశ్నించారు.

గర్భిణీకి రక్తదానం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

మండలంలోని తిరువెంగలాపురం గ్రామానికి చెందిన చంద్రకళ అనే గర్భిణి పోరుమామిళ్ల ప్రయివేట్ ఆస్పత్రిలో ప్రసవం కోసం చేరారు. ఆపరేషన్ నిమిత్తం ఆమెకు ఓ పాజిటివ్ రక్తం కావాలని వైద్యులు సూచించారు. ఆమె బంధువులు రక్తం కోసం ప్రయత్నించగా రైట్ హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. ట్రస్టు వ్యవస్థాపకులు నాయబ్‌రసూల్ స్పందించి పోరు మామిళ్లకు చెందిన టి. కల్యాణ అనే యువకుడు ఓ పాజిటివ్ రక్తదానం చేశారు

కష్టపడితే ఏ రంగంలోనైనా రాణించొచ్చు

- ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ మమతేశ్వరి

జ్యోతి ప్రజ్వలన గావిస్తున్న డాక్టర్ మమతేశ్వరి

ప్రజాశక్తి - కడప అర్బన్

కష్టపడేవారు ఏ రంగంలోనైనా రాణిస్తారని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ మమతేశ్వరి పేర్కొన్నారు. దేవుని కడప రోడ్డులోని చేపల కేంద్రం వద్ద ఉన్న అక్షయ నర్సింగ్ కళాశాల ఫ్రెషర్స్‌డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన, నైటింగేల్ చిత్రపటానికి పూలమాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మమతేశ్వరి మాట్లాడుతూ విద్య పూర్తి కాకుండా ఆసుపత్రులలో చేరవద్దని విద్యార్థులకు సూచించారు. కరోనా అనంతరం నర్సింగ్ స్టాఫ్‌కు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. రోగులతో మాట్లాడే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. చదువుకునే సమయంలో సమయం వృథా చేయవద్దని చెప్పారు. థియరీతోపాటు ప్రాక్టికల్స్ ముఖ్యమని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ విజయ్ కుమార్ మాట్లాడుతూ సీనియర్స్ ద్వారా జూనియర్ విద్యార్థులు మెలకువలు నేర్చుకోవాలని పేర్కొన్నారు. కళాశాలలో థియరీ ప్రాక్టికల్స్ కొంతవరకే ఉంటుందని మిగిలినదంతా ఆసుపత్రిలో నేర్చుకోవాల్సి ఉంటుందని చెప్పారు. బాగా చదివి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పరీక్షల్లో, క్రీడల్లో ప్రతిప చూపిన వారికి మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ శంకర సిద్దయ్య, డైరెక్టర్ సుబ్బరాయుడు, ప్రిన్సిపల్ నరేంద్ర, సుహాసిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రెడ్డప్ప (ఫైల్‌ఫొటో)

పట్టణంలోని నగరిగుట్ట ఎస్‌సి కాలనీలో అనుమానాస్పద స్థితిలో రెడ్డప్ప (24) మృతి చెందాడు. ప్రియురాలి ఇంట్లో సోమవారం ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడికి భారతితో రెండేళ్ల క్రితం వివాహమైంది. అతని స్వగ్రామం సత్యసాయి జిల్లా బత్తలపల్లె మండలం, రామాపురం గ్రామం. పులివెందులలో నివాసం ఉంటూ లారీ డ్రైవర్‌గా వెళ్లేవాడు. వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయమై గతంలో బంధువులు మందలించారు. అయినా వివాహేతర సంబంధాన్ని మానుకోలేదు. ప్రియురాలు ఇంట్లో ఉరి వేసుకోవడంతో తన భర్త మృతికి కారణం వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ, బంధువులేనని రెడ్డప్ప భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట బస్టాండ్ సమీపంలోని ఒక్కిలేరు వంతెనపై సోమవారం ఉదయం ఓ ద్విచక్ర వాహన దారుడు వేగంగా వచ్చి వృద్ధుడిని ఢీకొనడంతో పాటిమీదపల్లె గ్రామానికి చెందిన దాసరి గంగయ్య యాదవ్ (58) తీవ్రంగా గాయ పడ్డాడు. గంగయ్యకు కాలు, చేయి విరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గంగయ్య యాదవ్‌ను మండల టిడిపి నాయకులు సందుల నాగశివారెడ్డి, తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, అంకాల్ యాదవ్, రామానాయుడు పరామర్శించారు.

వరి సాగుపై రైతుల్లో ఆసక్తి

సిద్ధారెడ్డిపల్లి వద్ద సాగులో ఉన్న వరి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని రైతులు రబీలో (రెండవ కారు) వరి సాగుకు ఆసక్తి చూపారు. మండల పరిధిలో కుందూ, పెన్నా నది పరివాహక గ్రామాలతోపాటు బోరుబావుల కింద రబీలో సాగైన వరి పంట ఆశాజనకంగా ఉంది. రబీ సీజన్‌లో 3వేల ఎకరాల్లో వరి సాగైంది. ఖరీఫ్‌లో మండల పరిధిలో 13,382 ఎకరాల్లో వరి పంట వేశారు. ఖరీఫ్‌లో సాగైన వరి పంట మంచి దిగుబడి వచ్చింది. ధరలు కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు మళ్లీ వరి సాగు చేపట్టారు. మండలంలో నాగులపల్లె, చాపాడు, సీతా రామపురం, అనంతపురం, రాజువారిపేట, అయ్యవారిపల్లె, చియ్యపాడు, మొద్రాయిపల్లె, సోమాపురం, సిద్ధారెడ్డిపల్లె గ్రామాల పరిధిలో వరి సాగు చేశారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో వచ్చిన దిగుబడికి ధరలు కూడా బాగా ఉన్నాయి. జగిత్యాల రకం 8 బస్తాల (పుట్టి) ధర రూ.20వేలు పలుకు తున్నాయని రైతులు తెలిపారు. గత ఏడాది వరి పంట నూర్పిడి చేసిన సమ యంలో 8 బస్తాల వరి ధాన్యం విలువ రూ.10వేలలోపు మాత్రమే ఉండేది. దీంతో అప్పట్లో ధాన్యాన్ని అమ్ముకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. ధాన్యం నిలువ ఉంచుకున్న రైతులకు మాత్రం ప్రస్తుతం మంచి ధర పలుకుతోంది. రైతులు ఈ ఏడాది ఆరుతడి పంటల వైపు కూడా మెగ్గు చూపారు. వేసవి సీజన్‌లో 6వేల ఎకరాల్లో పంటలు సాగులో ఉన్నాయి.

డిఎంహెచ్‌ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సిబ్బందికి సూచనలిస్తున్న డిఎంహెచ్‌ఒ నాగరాజు

మండల పరిధిలోని పి.వెంకటాపురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీ షియన్ 104 వాహనాన్ని డిఎంహెచ్‌ఒ నాగరాజు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైరల్ ఫీవర్ అధికంగా ఉన్నందున ఫీవర్ సర్వే చేయాలని, వడదెబ్బ తగలకుండా పిల్లలకు, వృద్ధులకు అవగాహన కల్పించాలన్నారు. ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను సరఫరా చేయాలని సూచించారు. చిలంకూరు పిహెచ్‌సి పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్మా, హెల్త్ ఎడ్యుకేటర్ నాగముని రెడ్డి, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

ముద్దనూరు : అధికారులతో మాట్లాడుతున్న డిఎస్‌పి నాగరాజు

ఖాజీపేట : ఓటింగ్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ

చాపాడు : కర్రసాయంతో ఓటు వేసేందుకు వస్తున్న యువకుడు

ప్రజాశక్తి - ముద్దనూరు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు సోమవారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు రెండు బూత్‌లను ఏర్పాటు చేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వేర్వేరుగా వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. డిఎస్‌పి నాగరాజు పోలింగ్ కేంద్ర బందోబస్తును పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు చేశారు. నోడల్ అధికారి రమణారెడ్డి పర్యవేక్షించారు. ఎన్నికల పోలింగ్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో 1,133 మంది పట్టభద్రులకుగానూ 7,77 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. 68 శాతం ఓట్లు పోలయ్యాయి. 84 మంది ఉపాధ్యాయులకుగానూ 81 మంది ఓటు హక్కును వినియోగించున్నారు. 97 శాతం పోలైనట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. **ఖాజీపేట :** పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉపాధ్యాయులకు సంబంధించి 83 ఓట్లకుగాను వందశాతం పోలయ్యాయి. పట్టభద్రుల ఓట్లకు సంబంధించి 18వ నెంబర్ పోలింగ్ బూత్‌లో పురుషులు 433 ఓట్లు పోలవ్వగా, మహిళలకు సంబంధించి 153 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 586 ఓట్లతో 75.12 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే పోలింగ్ బూత్ 18-ఎలో 399 ఓట్లు పోలవ్వగా 390 పురుషులు, 177 మహిళలు ఓట్ల పోలైనట్లు అధికారులు వివరించారు. 567 ఓట్లగానూ 72.41శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఖాజీపేటలో ఎన్నికల సరళని తెలుసుకున్నారు. **అట్లూరు :** మండలంలో జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లు 606కు గానూ 441 పోలయ్యాయి. ఉపాధ్యాయ ఓటర్లు 13 ఉండగా వందశాతం పోలయ్యాయి. **వల్లూరు :** పట్టుభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. వల్లూరు ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభించారు. పట్టభద్రుల ఓట్లు 750గానూ 577, ఉపాధ్యాయుల ఓట్లకు సంబంధించి 21గానూ 20 ఓట్లు పోలయ్యాయి. **చెన్నూరు :** చెన్నూరు ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1101కుగానూ 924, ఉపాధ్యాయ ఓట్లు 67కుగానూ 66 పోలయ్యాయని అధికారులు తెలిపారు. పోలింగ్ సరళిని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సికె దిన్నె జడ్‌పిటిసి పి.నరేన్ రామానుజన్‌రెడ్డి, కమలాపురం టిడిపి ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి పరిశీలించారు. పోలింగ్ బూత్ వద్ద ఎస్ఐ శ్రీనివాసరెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. **పులివెందుల రూరల్ :** సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక పాత సత్రం పాఠశాల, బాలికల కళాశాల, మెయిన్ స్కూల్‌లో అధికారులు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఒక పోలింగ్ బూత్‌ను, పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి ఆరు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. కడప పార్లమెంటు సభ్యులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తన ఓటును పాత సత్రం పాఠశాలలో వినియోగించుకున్నారు. టిడిపి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తన ఓటును బాలికల కళాశాలలో వినియోగించుకున్నారు. పట్టభద్రులు 4463 ఓట్లగానూ 3,410 పోలై 76.41 శాతం నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 561గానూ 524 ఓట్లు పోలై 93.40శాతం నమోదైందని తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా డిఎస్‌పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిఐ రాజు, ఎస్ఐలు చిరంజీవి, హుస్సేన్, పోలీస్ సిబ్బందితో పర్యవేక్షించారు. **ఒంటిమిట్ట :** సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ఒంటిమిట్టలో ప్రశాంతంగా ముగిశాయి. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఓట్లు 820, ఉపాధ్యాయులు ఓట్లు 23 ఉండగా.. ఇందులో పట్టభద్రులు ఓట్లు 644, ఉపాధ్యాయులు ఓట్లు 23 పోలయ్యాయి. గత ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ఈసారి పట్టభద్రుల ఓటర్లు ఎక్కువగా పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలో మూడు పోలింగ్‌స్టేషన్లను పట్టభద్రులకు, ఒక పోలింగ్‌స్టేషన్ ఉపాధ్యాయులకు కేటాయించారు. పట్టభద్రులకు సంబంధించి మండల వ్యాప్తంగా 2,903 ఓట్లు ఉండగా, ఇందులో 2,166 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి 215 ఓట్లు ఉండగా, 205 ఓట్లు పోలయ్యాయి. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓట్లు 74.61శాతం, ఉపాధ్యాయుల ఓట్లు 95.34శాతం పోలయ్యాయి. ఎన్నికలను సిఐ మంజునాథరెడ్డి, తహశీల్దార్ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, ఎస్ఐలు కృష్ణయ్య, ప్రవీణ్‌కుమార్, కలమల్ల ఎస్ఐ శివప్రసాద్ పర్యవేక్షించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు డిఎస్‌పి నాగరాజు పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఎన్నికల విధులలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బందికి డిఎంహెచ్‌ఒ నాగరాజు పోలింగ్‌స్టేషన్ల వద్ద తగు సూచనలు చేశారు. **కాశినాయన :** మండలంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉపాధ్యాయ 40ఓట్లకుగానూ 39 పోలై 97.5శాతంగా నమోదైంది. పట్టభద్రుల ఓట్లు 771కి గానూ 534 పోలై 69.2శాతంగా నమోదైనట్లు అధికారులు వివరించారు. **చాపాడు :** పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా 1071 మంది ఓటర్లు ఉండగా 827 ఓట్లు పోలయ్యాయి. 577 మంది పురుషులు, 258 మంది మహిళలు ఉన్నారు. ఎన్నికల సరళిని ట్రైయినీ కలెక్టర్ కృష్ణ నాయక్, డిఎస్‌పి వంశీధర్ గౌడ్ పరిశీలించారు. సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ కెసి రాజు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. పంచాయతీరాజ్ ఇఇ రామచంద్రారెడ్డి, తహశీల్దార్ సుభాని పాల్గొన్నారు. ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం 5.25 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. **వేంపల్లె :** మండలంలో పట్టభద్రుల ఓట్లు 2,100, ఉపాధ్యాయులు ఓట్లు 164 ఉన్నాయి. వీరికి వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పట్టభద్రులు 1,604 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 153మంది ఓటు వేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐలు రఘురాం, తిరుపాల్ నాయక్ బందోబస్తు నిర్వహించారు. స్వల్ప వాదోపవాదాలు జరిగినప్పటికీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో అధికారులు, ఆయా పార్టీల నాయకులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. **కలసపాడు :** మండలంలో పట్టభద్రుల ఓటర్లు 857గాను 609మంది ఓటు హక్కును వినియోగించుకుని, 71శాతం నమోదైంది. ఉపాధ్యాయులు 50 మంది ఓటర్లు ఉండగా 48 మంది వినియోగించుకున్నారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పోలీస్ సిబ్బంది ఎన్నికల నిర్వహణ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. **పెండ్లిమర్రి :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజరాజేశ్వరిరెడ్డి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పెండ్లిమర్రిలో పట్టభద్రులు 1161కిగానూ 858 మంది ఓట్లు వేశారు. 74శాతంగా నమోదైంది. ఉపాధ్యాయ ఓట్లు 28కిగానూ వందశాతం పోలయ్యాయి. ఓటింగ్ ప్రారంభ సమయంలో వైసిపి, టిడిపి నాయకుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఎనిమిది నుంచే పోలింగ్ ప్రారంభమైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకిగానూ 476 ఓట్లు ఉండగా, 457 పోలై 96శాతం, పట్టభద్రుల ఓట్లు 3,309 ఉండగా, 2,523 ఓట్లతో 76.24శాతం నమోదైంది. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్‌రెడ్డి, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర హస్తకళల చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆయన తనయుడు వెంకటశివారెడ్డి పెద్దముడియంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్‌పి అన్బు రాజన్ మధ్యాహ్నం 12గంటలకు పతంగే రామన్నరావు హైస్కూలు 46వ బూత్ గ్రాడ్యుయేట్, 21వ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బూత్‌ను పరిశీలించారు. డిఎస్‌పి నాగరాజు ఆధ్వర్యంలో అర్బన్ సిఐ సదాశివయ్య కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలో ఉపాధ్యాయులకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా,15 పోలింగ్ కేంద్రాలను పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించినందుకు ఏర్పాటు చేశారు. రమణ మహర్షి స్కూల్ వద్ద వైసిపి, టిడిపి శ్రేణులు మధ్య స్వల్ప ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. అడిషనల్ ఎస్‌పిలు తుషార్ డ్యూడీ, ప్రేరణ కుమార్ ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. చిన్నచిన్న ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. **లింగాల :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 85శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని కడప అడిషనల్ ఎస్‌పి కృష్ణారావు, ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఆయన సోదరుడు భరత్‌కుమార్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు శశిభూషణ్‌రెడ్డి పరిశీలించారు. **ప్రొద్దుటూరు :** పట్టణంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు 67.87శాతం ఓటును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 90.76శాతం వినియోగించుకున్నారు. రమణ మహర్షి ఉన్నత పాఠశాల వద్ద టిడిపి నేత పుత్తా నరసింహారెడ్డికి, మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అంతలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సర్ది చెప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వైఎస్ బాలికోన్నత పాఠశాల సమీపంలో అధికార పార్టీకి చెందిన కొంతమంది డబ్బులు పంచుతున్నారని టిడిపి వర్గీయుల ఫిర్యాదుతో ఘర్షణ వాతావరణ చోటుచేసుకుంది. మీడియా మిత్రుడొకరు (ప్రజాశక్తి కాదు) ఎన్నికల సరళిని ఫొటో తీస్తుండగా అధికార పార్టీ నాయకుడు అతని సెల్ లాక్కున్నాడు. దీంతో మీడియా మిత్రులు నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు కలుగచేసుకొని ప్రశాంతంగా ఎన్నికల సరళిని కొనసాగించారు.

ప్రొద్దుటూరులో బారులుతీరిన పట్టభద్రుల ఓటర్లు

లింగాలలో ఇరుపార్టీల మధ్య నెలకొన్న ఘర్షణ

జమ్మలమడుగు రూరల్ : పోలీసు సాయంతో ఓటు వేసేందుకు వెళుతున్న విభిన్న ప్రతిభావంతుడు

15న ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి - కడప

విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సమస్యల పరిష్కారం పై 'ప్రత్యేక విద్యుత్ అదాలత్' ఈనెల 15న ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విద్యుత్ కార్యాలయంలో నిర్వహిస్తామని మైదుకూరు డివిజన్ విద్యుత్ అధికారి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.వి. రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు బద్వేలు, గోపవరం, అట్లూరు, బ్రహ్మంగారిమఠం, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై రాతపూర్వక ఫిర్యాదు ద్వారా మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విద్యుత్ కార్యాలయంలో తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లు.. ప్రమాదాలకు హేతువులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రికలు (ట్రాన్స్‌ఫార్మర్లు) పలుచోట్ల ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లను జనావాసాల మధ్య, తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందనలేదని ఆరోపిస్తున్నారు. మండలంలోని పత్తూరు నుంచి ధయాంఖాన్‌పల్లెకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే విద్యుత్ నియంత్రికలను ఏర్పాటు చేయడంతో, రాకపోకలకు సమస్యగా మారింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆ మార్గంలో వెళ్లే ప్రజలు హడలిపోతున్నారు. విద్యుత్ నియంత్రికల చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని, రహదారికి దూరంగా ఏర్పాటు చేయాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానిక సొసైటీ కాలనీలో జనావాసాల మధ్యలో విద్యుత్ నియంత్రిక ఉందని, మార్పు చేసి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించినా స్పందించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ నియంత్రిలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పత్తూరు-ధయాంఖాన్‌పల్లె దారిలో రోడ్డు పక్కగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

ఇంజినీరింగ్ విద్యార్థికి బాసట

ప్రజాశక్తి - కడప అర్బన్



లాప్ టాప్ అందజేస్తున్న బాసట బాలాజీ రావు

నగరం లోని బాసట సేవా సంస్థ మిత్రులు, దాతలు, సభ్యుల సహ కారంతో పలు సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తోంది. మరి యాపురానికి చెందిన బి.వర్షిత అన్నమాచార్య ఇంజినీరింగ్ కాలేజీలో మూడవ సం వత్సరం చదు వుతోంది. విద్యార్థిని ల్యాప్‌టాప్ కొనుగోలుచేసేందుకు ఇబ్బంది పడుతున్న సందర్భంలో చిన్నచౌక్‌కు చెందిన లక్ష్మీ రెడ్డిని బాసట సంస్థ ప్రతినిధులు సాయం చేయాలని కోరారు. ఆయన సహకారంతో రూ. 36 వేలు విలువ చేసే ల్యాప్ టాప్‌ను విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగా చదివి ఉద్యోగం వచ్చాక మరొకరికి సాయం చేయాలని హితవు పలికారు. కార్య క్రమంలో బాసట పుడ్ టీమ్ సభ్యులు కె. చంద్రమౌళి రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో గెలుస్తాం

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో పోరుమామిళ్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందరి సహకారంతో వైసిపి మద్దతు అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారు అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ జనరల్ డెవలప్‌మెంట్ సలహాదారులు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి, కుమారుడు ఆదిత్య రెడ్డితో కలిసి పోలింగ్ తీరు పర్యవేక్షించారు. 38 నియోజకవర్గాల పరిధిలో దాదాపు 400 బూతులు ర్పాటు చేశారని మంచి వాతావరణం లో ఓటు వినియోగించుకొవాలని తెలియజేశారు.